క్లుప్తంగా

## సందడిగా సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: మధుర స్వరాలశాల ఘంటసాల అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. సినీ సంగీత వారోత్సవాల్లో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం ఘంటసాల సినీ సంగీత విభావరి, ఘంటసాల స్ఫూర్తి సభను నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు వారి గుండెల్లో ఘంటసాల పేరు వినిపిస్తూ ఉంటుందని తెలిపారు. తెలుగు పాట, తెలుగు మాట ఘంటసాల వెంకటేశ్వరరావేనని తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, తటవర్తి సూర్యనారాయణ, డాక్టర్ భాగ్యశ్రీ శింగంశెట్టి చంద్రశేఖర్ సభలో పాల్గొన్నారు. ఒంగోలుకు చెందిన స్వరఝరి సాంస్కృతిక సేవా సమితి సభ్యులు శ్రీదేవి, మస్తాన్‌వలి, టి. శ్రీనివాస్, రామభద్రకుమార్, పూర్ణచంద్ర, చరణ్, అంజుస్వామి, కోట వెంకటేశ్వరెడ్డి ఆపాట మధురాల పేరుతో పలు చిత్ర గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

## మధురానగర్‌లో అంగన్‌వాడీ బడిబాట



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో శుక్రవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ సెంటర్‌లో అందించే సేవలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, ఐదేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో విద్య పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేసి పాఠశాలలకు పంపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిత్య జీవితంలో యోగా తప్పని సరి

సాక్షి, అమరావతి: నిత్య జీవితంలో యోగా అంతర్భాగం చేసుకోవాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా శుక్రవారం నగరంలోని శ్రీ చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యాన సహిత విద్య విభాగం రాష్ట్ర స్థాయి 10వ అంతర్జాతీయ మెగా ఇన్ క్లూజివ్ యోగా దినోత్సవం నిర్వహించారు. వేడుకలో విద్యార్థులు ప్రాణాయామ పద్ధతులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డాక్టర్ కె.వి.శ్రీనివాసులు రెడ్డి, అదనపు డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డి, చీఫ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, పలు జిల్లాల విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి మెగా ఇన్ క్లూజివ్ యోగాసనాలకు 'ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్'లు దక్కాయి. ఈ సందర్భంగా జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ సౌత్ ఇండియన్ కోఆర్డినేటర్ మడుపు రామ్‌ప్రకాష్, మిరాకిల్స్ బుక్ ఆఫ్ రికార్డ్ సౌత్ ఇండియన్ కోఆర్డినేటర్, ఎం.అరుణ సమగ్ర శిక్షా అధికారులకు అవార్డులను ప్రదానం చేశారు.

## సేంద్రియ ఎరువులనే వినియోగించాలి



రామవరప్పాడు: రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులనే రైతులు వినియోగించాలని డీఆర్‌సీ, ఏడీఏ పి.మౌనిష అన్నారు. విజయవాడరూరల్ మండలం గూడవల్లిలో శుక్రవారం డిస్ట్రిక్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారుమడి, కలుపు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష ప్రాముఖ్యత, పచ్చిరొట్ట ఎరువుల విశిష్టతపై రైతులకు విశ్లేషాత్మకమైన వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగనాథ్ బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# యోగాతో ప్రశాంతత, ఆరోగ్యం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా చేస్తున్న 'సిద్ధార్థ' విద్యార్థులు



విజ్ఞానవిహారలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



ఎస్టీవీఆర్ పాఠశాలలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): యోగాతో శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యుగంధర్ అన్నారు. సత్యనారాయణపురం శ్రీ విజ్ఞాన విహార పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఆయన యోగా విశిష్టతను వివరించారు. విద్యార్థులు రోజూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జేవీ షణత్ కృష్ణ మాట్లాడుతూ నేటి వత్తిడి జీవితంలో యోగా చేస్తే లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ బీఈ సీతామహాలక్ష్మి, డీవీ ఎస్‌వీ భాస్కర్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

**ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో..**

మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి యోగా ప్రాధాన్యత వివరించారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు వేశారు.

**దుర్గాపురంలో...**

దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్య ప్రభ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**

లబ్బీపేట(విజయవాడతూర్పు): యోగా చేస్తూ, ఆహార అలవాట్లు మార్చుకుంటే ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా లబ్బీపేటలోని ఆయన నివాసంలో శుక్రవారం యోగ సాధన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను ప్రపంచ వ్యాప్తంగా సాధన చేస్తున్నారని పేర్కొన్నారు. నేటి యాంత్రిక జీవితంలో మనిషి ఎన్నో వత్తిళ్లకు గురై, శారీరక, మానసిక వ్యాధులకు లోనవుతున్నాడని, యోగాను జీవితంలో భాగం చేసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. దీర్ఘకాలిక రోగాల నుంచి సైతం ఉపశమనం కలిగే వీలుంటుందని పేర్కొన్నారు. యోగాసనాల ద్వారా జ్ఞాపకశక్తి పెంపొంది విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కుల సాధించగలుగుతారన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగా సాధనను భాగంగా చేసుకోవాలని మల్లాది విష్ణు పిలుపునిచ్చారు.



యోగ సాధన చేస్తున్న మల్లాది విష్ణు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్కూల్ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దత్త క్రియా యోగా ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు పి.అరుణ, ఎస్.అరుణ, నిహారిక విద్యార్థులతో ఆసనాలు వేయించారు. నిత్యం యోగ సాధనతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం స్కూల్ వార్షిక మ్యాగజైన్‌ను ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ సీతారామయ్య ఆవిష్కరించారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ అన్నారు. అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని ఆ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి కుటుంబానికి చెందిన యోగా గురువు గుణశేఖర్ ప్రాణయామం, ధ్యానం చేసే విధానాన్ని విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం జోనల్ ఇన్‌చార్జిలు రత్న కిషోర్‌బాబు, వీర రాఘవరావు, కె.మాధవ్‌లతో పాటు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఏఎన్ఓ కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డులోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో యోగా డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్‌కు చెందిన యోగా గురువులు, ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): యోగాతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మైనం హుస్సేన్ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హైస్కూల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు యోగా టీచర్ పూర్ణ ఆధ్వర్యంలో యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాజీవ్‌నగర్(విజయవాడ)లో ప్రాంతీయ ఆయుర్వేద సంస్థలో అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్ (పరిశోధనాధికారి), డాక్టర్ కె.అనుమోల్(పరిశోధనాధికారి) తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైల్వే ఫంక్షన్ హాలులో జరిగిన ప్రత్యేక యోగా కార్యక్రమంలో ప్రఖ్యాత యోగా మాస్టర్ తేజా ఆధ్వర్యంలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, పలు విభాగాలకు చెందిన 400 మంది అధికారులు, సిబ్బంది యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు పి.ఈ ఎడ్విన్, కొండ శ్రీనివాస్, ఏపీఓ ఎం.అనిరుధ్, పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగా డేలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



స్కూల్ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఆయుర్వేద సంస్థ ప్రాంగణంలో ..

# దేశ ఆర్థికాభ్యున్నతికి అండగా స్టార్టప్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్టార్టప్స్ దేశ ఆర్థికాభ్యున్నతికి అండగా నిలుస్తున్నాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య బి.సుధాకరరెడ్డి అన్నారు. కేబీఎన్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇండియన్ స్టార్టప్స్ – సమస్యలు – సవాళ్లు – అవకాశాలు' అంశంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే సదస్సు ప్రారంభోత్సవ సభకు ఆచార్య బి.సుధాకరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం ఐదో అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. దాన్ని మూడో స్థానానికి తీసుకెళ్లడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆ క్రమంలో స్టార్టప్స్ దేశ ఆర్థిక వృద్ధిని పెంపొందించటంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. గడిచిన పదేళ్లగా ప్రారంభమైన స్టార్టప్స్ అనేక గొప్ప సంస్థలుగా ఎదిగాయన్నారు. అవి గొప్ప ఆర్థిక వ్యవస్థలుగా స్థిరపడుతున్నాయని తెలిపారు. వీటిపై మరింత విస్తృతమైన చర్చ జరిగినప్పుడు సమాజానికి మరింత మేలు జరుగుతుందని చెప్పారు. దేశ వికాసానికి తద్వారా సామాజిక అభ్యున్నతికి అవసరమయ్యే ఆవిష్కరణలకు ఎసీఎస్ఎస్ఆర్ ఆర్థిక చేయూతనందిస్తుందన్నారు. అధ్యాపకులను తీర్చిదిద్దడానికి సైతం ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. మలేషియాకు చెందిన ఏషియన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆచార్యులు షరన్‌కుమర్‌షెట్టి కీలకోపాన్యాసం చేస్తూ ప్రతి పయనంలోనూ గెలుపోటములు సహజమన్నారు. ప్రతి చోటా సవాళ్లు అనివార్యమని వివరించారు. ముందుకు అడుగు వేయడమే విజయానికి సంకేతమని వివరించారు. యువతలో వచ్చిన అనేక గొప్ప ఆలోచనలు స్టార్టప్స్‌గా తద్వారా పెద్ద సంస్థలుగా ఆవిర్భవించాయని వివరించారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం (తిరుచురాపల్లి) హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సీనియర్ డీన్ డాక్టర్ ఆర్ కిట్టప్ప వైద్యనాధన్, కృష్ణా విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆచార్యులు డాక్టర్ సీహెచ్ జయశంకరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు స్టార్టప్స్ దిశగా తమ ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అవకాశాలను వినియోగించుకున్నప్పుడే మంచి విజయాలను సొంతం చేసుకుంటారన్నారు. సదస్సుకు సమర్పించిన అధ్యయన పత్రాల సావనీర్‌ను ఆచార్య సుధాకరరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి హరగోపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, సదస్సు కన్వీనర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు



హాజరైన అధ్యాపకులు

# పురాణపురుషా గోవిందా

- శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- తొలి రోజున పంచామృత అభిషేకాలు
- పెళ్లికుమారుడిగా అలంకరణ
- అఖండ దీపారాధన, వాస్తు హోమాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పురాణపురుషా గోవిందా అంటూ భక్తజనం వేంకటేశ్వరుడిని మనసారా కొలిచారు. చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, పాలక వర్గ సభ్యులు, ఉభయదాతలు, భక్తులు మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గాఘాట్‌కు చేరుకుని సహస్ర కలశాలతో పవిత్ర జలాలను తీసుకుని తిరిగి ఆలయానికి చేరుకున్నారు. దేవస్థానం ఆవరణలోని ఆస్థాన కల్యాణ మండపంలో పద్మావతి, గోదాదేవి శ్రీ వేంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి అభిషేక కార్యక్రమాన్ని వీక్షించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కల్యాణ వేదిక వద్ద ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. పంచామృత అభిషేకాల అనంతరం ఇరుదేవేరులను, స్వామి వారిని పెండ్లి కుమారుడు, పెళ్లికుమార్తెలుగా అలంకరించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు, ఉభయదాతలు, భక్తులతో కలిసి భాగ్యలక్ష్మి.. స్వామి వారికి పూజా ద్రవ్యాలు, పట్టువస్త్రాలను సమర్పించారు.

సాయంత్రం దేవతామూర్తుల వద్ద అఖండ దీపారాధన, ఉత్సవాలకు అంకురార్పణ, వాస్తుపూజలను టీటీడీ వేద విద్యాలయం ప్రొఫెసర్ మురికిపూడి మణిదీప్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం యాగశాలలో వాస్తు హోమాలు, ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే ఉభయదాతలు, భక్తులు, ఆలయ సిబ్బందికి దీక్షాచరణ, కంకణధారణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, పొట్నూరి రాజా, పోతిన బేసి కంతేశ్వరుడు, తమ్మిన సూర్యకుమారి, పణుకు రమ, మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దేవతా మూర్తులకు పంచామృత అభిషేకాలు



స్వామి వారిని దర్శించుకుంటున్న మేయర్ భాగ్యలక్ష్మి

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు జరుగుతుండటంతో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీబీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవీఎస్ రెడ్డి రోడ్డు, హరహర క్షేత్రం, చలసాని స్కూల్ రోడ్డు రెండు వైపులా, క్రాంతి స్కూల్ ఆపోజిట్ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి. వి. సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపుతోట, సాయిబాబాకాలనీ, లెక్చరర్స్ కాలనీ, వీవీ నరసరాజురోడ్డు, పప్పులమిల్లు, దేవీనగర్, రామకృష్ణాపురం, నేతాజీ కాలనీ, బుడమేరు మధ్యకట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

## ముగిసిన వర్క్‌షాప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల సామాజిక శాస్త్ర పరిశోధన దత్తాంశం విశ్లేషణ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాల అకడమిక్ డీన్ రాజేష్ మాట్లాడుతూ నిరంతరం పరిశోధనలు ఉండకపోతే భవిష్యత్తు మనుగడ కష్టసాధ్యమన్నారు. ఒక కంపెనీ, వ్యక్తి అయినా కొత్తదనాన్ని చూపనట్లయితే గుర్తింపు కోల్పోవలసి వస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వర్కు షాపులో గ్రహించిన విషయాలు తోటి అధ్యాపకులు, విద్యార్థులతో పంచుకొని నాణ్యత కలిగిన పరిశోధన ద్వారా సమాజానికి ఉపయోగపడే ఫలితాలు రాబట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ అచ్యుత రామ కిషోర్, జె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం పలు కళాశాలల నుంచి వర్క్‌షాప్‌కు హాజరైన అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

## వివాహిత అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యంపై భర్త ఫిర్యాదుతో కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కోమల విలాస్ ప్రాంతానికి చెందిన దీపక్‌జైన్, సంతోషి భార్యభర్తలు. వీరిది ప్రేమ వివాహం. దీపక్ ప్లైవుడ్ షాపులో పని చేస్తుంటాడు. దీపక్ తల్లికి సంతోషికి అప్పుడప్పుడు చిన్నపాటి గొడవలు జరుగుతుంటాయి. రెండు రోజుల క్రితం కూడా అత్త కోడలికి అదే తరహాలో గొడవ జరిగింది. దీంతో ఈ నెల 20వ తేదీ సంతోషి తన పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తన భార్య కనిపించడం లేదంటూ దీపక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నేడు జాబ్‌మేళా

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్, వైస్ చైర్మన్లు నరెడ్ల నర్సిరెడ్డి, సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ, డిప్లమో, బీటెక్, బీ ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలియజేశారు. జాబ్‌మేళాలో పాల్గొనే వారు తమ విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఈ ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం వికాస్ విద్యాసంస్థల ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎస్.కిషోర్‌బాబును 94908 88445, 94925 52636 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

గన్నవరం రూరల్: మలేరియా వ్యతిరేక పోరాటంతో అందరూ భాగస్వాములు కావాలని ఆత్కూరు పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి వెంకటరాజు రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. వీరపనేని గూడెం గ్రామంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక ప్రచార ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ దోమలు పెరగకుండా అందరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వ ఉండే ప్రతి వస్తువును దూరంగా పెట్టాలన్నారు. చెత్తను దూరంగా పారబోయాలని సూచించారు. మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 17 గదులకు మాలథీన్ మందును స్ప్రే చేయించారు. వసతి గృహంలో ఉంటున్న కిశోర బాలికలు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, జ్వరాలు రాకుండా పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారికి గరుడ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో స్వామి వారికి గరుడ వాహనోత్సవ సేవ అత్యంత వైభవంగా జరిగింది. నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన బ్రాహ్మణ వీధి లోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జ్యేష్ఠ మాసం పౌర్ణమిని పురస్కరించుకొని గరుడ సేవను నిర్వహించారు. అలంకరించిన గరుడ వాహనంపై స్వామి వారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి పూజలు నిర్వహించారు. స్వామి వారికి జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం అభిషేకాన్ని నిర్వహించారు. జ్యేష్ఠమాసంలో పౌర్ణమి రోజున అభిషేకం ఆనవాయితీ. స్వామివారి ఉత్సవమూర్తులకు ఉదయం ఆలయంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్ చేశారు.

**కోదండ రామాలయంలో..**

పాతబస్తీలోని శ్రీ కోదండ రామాలయంలో స్వామి వారికి జ్యేష్టాభిషేకం చేశారు. స్వామివారి మూర్తులకు ప్రత్యేక తిరుమంజన అభిషేకాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, పులిపాక ఆంజనేయాచార్యులు జరిపించారు.



స్వామివారికి అభిషేకాలు



గరుడ వాహనంపై వెంకన్న

## బైక్ ఢీ.. వివాహితకు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని వివాహితకు గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీకి చెందిన పోలిపల్లి పద్మ, బంగార్రాజు భార్యభర్తలు. ఈ నెల 19న వారిద్దరూ బైక్‌పై వించిపేట వెళ్తుండగా, సీవీరెడ్డి ఫ్లైవర్‌పై గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వచ్చి ఢీ కొట్టింది. పద్మకు గాయాలు కావడంతో గొల్లపూడిలోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

**మరో ఘటనలో..**

పెనమలూరు: పోరంకి గ్రామ పరిధి విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పాత పోలీస్‌స్టేషన్ రోడ్డుకు చెందిన వి.అరుణ వంట పనులు చేస్తుంది. గురువారం అరుణ తాడిగడపలో వంట పని ముగించుకుని ఇంటికి వెళ్తూ పాత పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు ఆమెను ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో ఆమెకు కాలు విరిగింది. ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.